ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 9 నవంబరు 2024



రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో నూతన వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు అన్నిరకాల సేవలు అందించడం కోసం ప్రాథమిక సహకార సంఘాలు(ప్యాక్స్) జిల్లాలోని ప్రతి గ్రామం, మండలం కవర్ అయ్యే విధంగా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో ఉన్న 20 ప్యాక్స్‌కు అదనంగా మరో 5 నుంచి 7ప్యాక్స్ ఏర్పాటు చేయాలని, వీటి ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్యాక్స్ ద్వారా రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలతో పాటు అవసరమైన ఎరువులు విత్తనాలు అమ్మకం, వారి ధాన్యం సేకరణ, బంగారు రుణాలు, ఇతర సేవలు అందించాలని తెలిపారు. జిల్లాలోని ఎలిగేడు, చిన్నకాల్వల ప్యాక్స్‌ల పరిధిలోని జనఔషధ కేంద్రాలను నిర్వహించేందుకు రిజిస్ట్రేషన్ చేయించాలని, జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఎఫ్‌సీఎస్ అనుకూలంగా ఉన్నచోట డెయిరీ కార్పొరేట్ సొసైటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డెయిరీ కార్పొరేటు సొసైటీల ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి ఆర్థిక సహకారమైన నాబార్డు ద్వారా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు గోదాములు, కోల్డ్ స్టోరేజీ, రైస్ మిల్లుల ఏర్పాటుకు ముందుకు వస్తే అవసరమైన సంపూర్ణ సహకారం అందజేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, డీడీఎం నాబార్డ్, జిల్లా మత్స్యశాఖ అధికారి లీడ్ బ్యాంకు మేనేజర్ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు పెద్దపల్లిలో సదర్ సమ్మేళనం

సుల్తానాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 10న సదర్ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు సుల్తానాబాద్ పట్టణంలో శుక్రవారం సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదవ సదర్ సమ్మేళనం నేతలు పకీర్ యాదవ్, మహేందర్ యాదవ్, తాత సదానందం, చిట్టవేణి సదయ్య, కుమార్, మెండె శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దపల్లిలో ఈనెల 10 న, నిర్వహించనున్న సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు కావటి రాజు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం సదర్ వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, యాదవులకు సదర్ పండుగ అతిపెద్దదని, జిల్లా కేంద్రంలో నిర్వహించడం చరిత్రలో ఇదే మొదటిసారి అని తెలిపారు. ఈ పండుగలో సోదరి ఇంటికెళ్లిన సోదరునికి కానుకలు బహుమతులు ఇచ్చే సంస్కృతి ఉంటుందని, ఇతర పండుగలకంటే ఇది భిన్నంగా ఉంటుందని తెలిపారు. పెద్దఎత్తున నిర్వహించే సదర్ సమ్మేళనానికి మండలంలోని యాదవులంతా తరలిరావాలని కోరారు. దీనికి జిల్లాలోని ముఖ్య నాయకులతో పాటు, రాష్ట్రం నుంచి పలువురు ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సామ శంకర్, తెల్లూరి కొమరయ్య, బండారి శ్రీనివాస్, ఐతమ్ సతీష్, వెంకటేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గర్రెపల్లి సింగిల్ విండోలో అక్రమాలు

- భూమి కొనుగోలులో మాయాజాలం
- రూ.39 లక్షలకు కొనుగోలు చేసి రూ.44 లక్షలకు పత్రాలు
- విచారణ జరిపించాలంటూ సంఘ సభ్యుల డిమాండ్



గర్రెపల్లి సింగిల్ విండో పాలకవర్గం కొనుగోలు చేసిన స్థలం

పెద్దపల్లి/సుల్తానాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కొనుగోలులో మాయా జాలం చోటుచేసుకున్నది. కొనుగోలు చేసిన భూ యజమాని పేరిట 44 లక్షల రూపా యలు డ్రా చేసిన పాలకవర్గం, ఆ యాజమానికి 37 లక్షలు మాత్రమే అందజేసి 7 లక్షల రూపాయలు కాజేసి నట్లుగా ప్రచారం జరుగుతున్నది. ఈ వ్యవహారం ఆ నోట ఈ నోట బయటకు పొక్కడంతో పలువురు పాలకవర్గ సభ్యులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధం అవుతున్నట్లు సమాచారం. వ్యవసాయ రంగంలో రైతులకు చేదోడు వాదోడుగా ఉండాల్సింది పోయి వారి సొమ్ముకే ఎసరు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. గర్రెపల్లిలోని సహకార సంఘం సొంత స్థలంలో 20 ఏళ్ల క్రితమే విశాలమైన గదులతో పక్కా భవనం నిర్మించారు. వాస్తవానికి ఇక్కడ మరో భవనం అవసరం లేదు. కానీ సంఘం సేవలు విస్తరింపజేయాలనే ఆలోచనతో ప్రస్తుత పాలకవర్గ సభ్యులు నూతన భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఈ భవనాన్ని పక్క గ్రామంలో నిర్మించాలని భావించినప్పటికీ గ్రామస్తులు అడ్డు చెప్పడంతో నిర్ణయం మార్చుకున్నారు. గర్రెపల్లిలోనే ఆరు మాసాల క్రితం రాజీవ్ రహదారి పక్కన స్థలాన్వేషణ చేశారు. అదే గ్రామానికి చెందిన సందెవేని శ్రీనివాస్‌కు చెందిన సర్వే నంబరు 67/ఆ లోని మూడున్నర గుంటల భూమిని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఆ భూమికి మొదట 39 లక్షల రూపాయలు ఖరారు చేసుకున్నారు. కానీ 44 లక్షల రూపాయలకు కొనుగోలు చేసినట్లు రికార్డులు సృష్టించి కో-ఆపరేటివ్ అధికారులను నమ్మించారు. ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో భూయజమానికి చెల్లించారు. అందులో నుంచి నెల రోజుల క్రితం అగ్రిమెంట్ ప్రకారం కాకుండా రికార్డుల్లో అదనంగా సృష్టించిన ఐదు లక్షల రూపాయలతో పాటు యజమాని నుంచి మరో రెండు లక్షలు కలుపుకొని మొత్తం 7లక్షల రూపాయలు పాలకవర్గం కాజేసినట్లు సమాచారం. తమకు ఖర్చులు ఉంటాయని ముందే భూయజమానికి చెప్పి ఒప్పందానికి మించి ఐదు లక్షల రూపాయలు అదనంగా రికార్డుల్లో రాయించారని తెలిసింది. కానీ ఆ భూమికి అంత విలువ లేదని ఇప్పటికే ఎక్కువ ధర చెల్లించామని అందులో 39 లక్షలకు బదులు 37 లక్షలు తీసుకొని మిగతా రెండు లక్షల రూపా యలు తిరిగి ఇవ్వాలని భూయజమానిపై ఒత్తిడి పెంచి తీసుకున్నట్లు సమాచారం.

● ఖర్చులు ఉంటాయని చెప్పి..

సదరు స్థలాన్ని 39 లక్షల రూపాయలకు బేరం కుదుర్చుకున్న పాలకవర్గం 44 లక్షల రూపాయలకు కొనుగోలు చేసినట్లు పత్రాలు సృష్టించారు. ఎవరడిగినా 44 లక్షలకు విక్రయించినట్లు చెప్పాలని భూయజమానికి హుకుం జారీ చేశారని తెలిసింది. అదనంగా రాసుకున్న 5 లక్షల రూపాయలు ఖర్చుల కోసమేనని సెలవిచ్చారు. కొన్ని రోజులు కాలయాపన చేసిన అనంతరం పలు దఫాలుగా అతడికి చెక్కుల రూపంలో 44 లక్షల రూపాయలు ముట్టజెప్పారు. వారు తిరిగి 5 లక్షలకు

మిగతా 8వ పేజీలో..

భూసేకరణ పూర్తి చేయడంపై శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తిచేసే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో భూసేకరణ అంశాలపై అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్-మంచిర్యాల 136 జి 4లైన్ల గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి పెండింగ్ భూసేకరణ త్వరగా ముగిసేలా చూడాలని అధికారులకు సూచించారు. అవార్డు పాస్ చేసిన భూసేకరణ కేసులను సంబంధిత జాతీయ రహదారి అథారిటీకి అప్పగించాలని, పెండింగ్‌లో ఉన్న ఏమెంట్స్ వివరాలను తెప్పించుకొని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. అనంతరం సింగరేణి సంబంధించి పెండింగ్ ఆర్ఆర్ సమస్యలపై రివ్యూ నిర్వహించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, సింగరేణి భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, సంబంధిత తహసీల్దార్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలను ఒకేసారి నిర్వహించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

8

ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తా..

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

8

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి : ఏఐవైఎఫ్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మల్కాపూర్ శివారులోని సర్వే నంబరు 98లోని ప్రభుత్వ భూమిని పరిరక్షించాలంటూ శుక్రవారం ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య ఆధ్వర్యంలో రామగుండం తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 98లోని 17ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని, ధరణి రికార్డుల ప్రకారం 17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, అగ్నిమాపక కార్యాలయంతో పాటు కొంత ఖాళీ స్థలం ఉందని, దానికి ఎలాంటి ప్రహరీ నిర్మించకపోవడం వల్ల భూకబ్జాదారులు అక్రమించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఖాళీ స్థలంలో పారా మెడికల్ కళాశాల కానీ, నర్సింగ్ కళాశాల కానీ ఏర్పాటు చేయాలని కోరారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సుధీర్‌కుమార్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

కోల్‌సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామ గుండం 43వ డివిజన్‌లో స్పెషల్ డెవలప్‌మెం ట్ ఫండ్ రూ.5లక్షలతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను శుక్రవారం కార్పొరే టర్ ధరణి స్వరూపతో కలిసి కార్పొరేటర్ మహంకాళి స్వామి ప్రారంభించారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులను చూడలేక బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని, ఏడాదిలోపల రామగుండం సుందరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్పొరేటర్ ఎండీ ముస్తాఫా, నాయకులు గట్ల రమేష్, దూళికట్ట సతీష్, ఆడెపు కృష్ణ, పులి రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

గోదావరిఖని/ధర్మారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయన నివాసంలో రేవంత్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిసిన వారిలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అలాగే యాదగిరి గుట్టలో సీఎం రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులతో కలిసి యాదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



యాదగిరిగుట్టలో ముఖ్యమంత్రితో పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ఎన్టీపీసీలో కొత్త ఆవిష్కరణలు

- గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీకి శ్రీకారం - ఆర్ఈడీ కేదార్ రంజన్ పాండు



నృత్యం చేస్తున్న కళాకారులు

జ్యోతినగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణోత్సవాలను జరుపుకుంటున్న ఎన్టీపీసీ కొత్త ఆవిష్కరణకు వేదిక అవుతున్నదని రామగుండం ప్రాజెక్టు, ఆర్ఈడీ(దక్షిణ) కేదార్ రంజన్‌పాండు అన్నారు. ఎన్టీపీసీ 50వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం రాత్రి కాకతీయ ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలల్లో పాల్గొని ప్రసంగించారు. ఎన్టీపీసీ గ్రీన్‌హైడ్రోజన్ టెక్నాలజీకి శ్రీకారం చుట్టిందని, కాశ్మీర్‌లోని లేహ్‌లో గ్రీన్‌హైడ్రోజన్ ఇంధనంగా వాహనాలను ప్రయోగాత్మకంగా నడుపుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నూతన సాంకేతిక పరిజ్ఞానం, దేశ అభివృద్ధికి ఎన్టీపీసీ చేయూతనందిస్తుందని తెలిపారు. అనంతరం హైదరాబాద్, మంచిర్యాల కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జీఎంలు, అధికారులు, యూనియన్ల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కళ్యాణ్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ తీగల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏడీ ఈ అడిచర్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గౌతమిన గర్, జనగామ సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు, దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : ప్రతినెల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అదనపు సహాయక ఇంజనీరు మహమ్మద్ ఖాసీం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మారం, మల్లాపూర్, కొత్తూర్ గ్రామాల సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

● జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మండలంలోని జూలపల్లి, కాచాపూర్, తెలుకుంట గ్రామాల్లో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరపరాలో అంతరాయం ఉంటుందని ఏఈ హరీష్ తెలిపారు. దీనికి మండల వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెంచుల అభివృద్ధికి ప్రత్యేక కృషి..

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



చెంచు కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చెంచుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. తన 58వ పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని అట్టడుగు వర్గానికి చెందిన చెంచు కుటుంబాలతో శుక్రవారం పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం 60మంది చెంచులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెంచు కుటుంబాలు విద్యాపరంగా, వృత్తిపరంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. చెంచుల అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. చెంచులకు ప్రస్తుతం ఉండడానికి 14ఉన్నాయని, ఇల్లులేని కుటుంబాలకు ఇందిరమ్మ గృహాలు ఇచ్చి ఆదుకుంటామన్నారు. తన పుట్టినరోజు చెంచు కుటుంబాలతో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే విజయరమణరావు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలు తీర్చే గొప్ప నాయకుడని ఆయన కొనియాడారు. అనంతరం మాజీ ఎంపీపీ గోపగోని గోపగోని సారయ్యగౌడ్‌తో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామడి తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, నాయకులు తులా మనోహర్‌రావు, ఓరుగంటి కొమురయ్య, బంగారు రమేష్, అల్లం దేవేందర్, మాదాసు సతీష్, శివ రామకృష్ణ, ఆరెల్లి రమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలంటూ హమాలీల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న హమాలీ కార్మికులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ గౌస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు హోల్‌సేల్ వ్యాపారులు కూలి పెంచకుండా కాలయాపన చేస్తున్నారని, హమాలీలకు కూలి రేట్లు పెంచాలని వినతిపత్రం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే స్పందించి కూలీ రేట్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కండె లక్ష్మయ్య, గడ్డం రాంచందర్, బండారి రవీందర్, గాలిపెల్లి సతీష్, ఆవుల ఐలయ్య, జానిమియా, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



రాజన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



ధర్మపురి గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళలు

కార్తీక దీపోత్సవం

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో సందడి

కార్తీక శుక్రవారం సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో సందడి నెలకొంది. మహిళలు భక్తితో దీపాలు వెలిగించి తమ ఇష్టదైవాలను స్మరించుకున్నారు. వేములవాడ, ధర్మపురి, కొండగట్టులో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

వేములవాడ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక దీపోత్సవం వైభవంగా కొన సాగుతోంది. కార్తీకమాసం సందర్భంగా నిత్యం రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో సామూహికంగా కార్తీక దీపాలు వెలిగిస్తున్నారు. శుక్రవారం కార్యక్రమాన్ని ఏఈవో రమేష్‌బాబు ప్రారంభించారు. ఆలయానికి వచ్చిన భక్తులతోపాటు పట్టణానికి చెందిన మహిళలు వివిధ ఆకృ తుల్లో దీపాలను వెలిగించారు. అంతకుముందు స్వామివారికి మొక్కు లు చెల్లించుకున్నారు. వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన భక్త బృందం భజన కార్యక్రమం ఆకట్టుకుంది. వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా భక్తులు రాజన్న ఆలయ ఎదుట కార్తీక దీపాలను వెలిగించారు.



కొండగట్టులో దీపారాధన

● ధర్మపురిలో కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి: ధర్మపురిలో గోదావరి హారతి కొన సాగుతోంది. ఏడో రోజు శుక్రవారం ఆలయం నుంచి వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం



ధర్మపురిలో గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య విశేష పూజలు జరిపారు. నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు.

● కొండగట్టులో..

మల్యాల: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని కొండగట్టు అంజనేయ స్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్ర వారం రాత్రి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంత రం భక్తులతో కలిసి దీపారాధన చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు చంద్రశేఖర్, ప్రధానర్చకులు రఘు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో

● ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

జమ్మికుంట రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండ లం నాగంపేట గ్రామ సమీపంలో ట్రాలీ ఆటో, బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాల య్యాయి. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ముత్తారం గ్రామానికి చెందిన చుంచు రమేష్, తుడవేన చంద్ర మొగిలి బైక్‌పై జమ్మికుంటకు వచ్చారు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయల్దేరగా, మార్గం మధ్యలో నాగంపేట సమీపంలో ట్రాలీ ఆటో ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న రమేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక ఉన్న చంద్ర మొగిలి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రమేష్ భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుకున్న వ్యక్తికి వినూత్న శిక్ష

● రెండు రోజులు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని జడ్జి తీర్పు

పెద్దపల్లిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి శుక్రవారం వినూత్న శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ అనీల్‌కుమార్ తెలిపారు. వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడ్డ 22 మందిని పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులు స్థానిక కోర్టులో హాజరు పరిచారు. వారిని విచారించిన జడ్జి మంజుల 20మందికి 23వేల రూపాయల జరిమానా విధించారు. అయితే అత్యధికంగా మద్యం సేవించి వాహనం నడిపిన కమాన్‌పూర్‌కు చెందిన ఇందారపు రమేష్‌కు 500 రూపాయల జరి మానాతో పాటు సామాజిక సేవలో భాగంగా రెండు రోజులపాటు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని తీర్పునిచ్చారు. శని, ఆదివారాల్లో రమేష్‌ను ట్రాఫిక్ విధుల్లో ఉపయోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

అడ్ హాక్ కమిటీ సభ్యుడిగా నర్సాగౌడ్

కొడిమ్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ పార్లమెంట్ అడ్‌హాక్ కమిటీ సభ్యుడిగా మండల కేంద్రానికి చెందిన గుర్రం నర్సాగౌడ్‌ను నియామకం చేస్తూ టీడీపీ నాయకత్వం ఉత్తర్వులను జారీ చేసింది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2024-2026 టీడీపీ సభ్యత్వ నమోదుకు అడ్‌హాక్ కమిటీ సభ్యుడిగా నియామకం చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. నర్సాగౌడ్ మాట్లాడుతూ చొప్పదండి నియోజక వర్గంలో అధికంగా పార్టీ సభ్యతం చేయిస్తానన్నారు. టీడీపీ నాయకులు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



నర్సాగౌడ్

బ్యాటరీ దొంగల అరెస్టు

గన్నేరువరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం, మానకొండూరు, తిమ్మాపూర్, కొత్తపల్లి, శంకరపట్నం మండలాల్లో పలు గ్రామాల్లో 5.2 లక్షల రూపాయల విలువ గల ట్రాక్టర్ బ్యాటరీలు, హైడ్రాలిక్ పట్టీలను దొంగిలించిన ముఠాను గన్నేరువరం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ వెంకటరమణ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. రామడుగు మండలంలోని వెదిరె గ్రామానికి చెందిన సత్తు ప్రవీణ్(19)తోపాటు మరో నలుగురు కరీంనగర్‌లో సెల్ఫ్ డ్రైవింగ్ కారును అద్దెకు తీసుకుని చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ ఆరుబయట నిలిపి ఉంచిన ట్రాక్టర్ల లోని బ్యాటరీలను, హైడ్రాలిక్ పట్టీలను దొంగలించడం ప్రారంభించారు. ఈ క్రమంలో గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్, గుండ్లపల్లి గ్రామాల్లో 16 ట్రాక్టర్ల బ్యాటరీలు, హైడ్రాలిక్ పట్టీలు దొంలించడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గన్నేరువరం ఎస్‌ఐ, సిబ్బందితో కలిసి సీసీ కెమరాల ఫుటేజీతో నేరస్థులు వాడిన కారును గుర్తించారు. ఆ కారు ద్వారా నిందితులను పట్టుకున్నారు.. బ్యాటరీల దొంగతనంపై కమిషనరేట్ పరిధిలోని ఐదు పోలీస్‌స్టేషన్‌లలో గన్నేరువరంలో రెండు, ఎల్ఎండీలో



వివరాలను వెల్లడిస్తున్న కరీంనగర్ రూరల్ ఏసీపి వెంకటరమణ

మూడు, కొత్తపల్లిలో ఒకటి, మానకొండూరులో ఒకటి, శంకరపట్నంలో ఒకటి మొత్తం ఎనిమిది కేసులు నమోదయ్యాయి. 39 బ్యాటరీలు, 25 హైడ్రాలిక్ పట్టీలను దొంగల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అతి తక్కువ సమయంలో దొంగలను పట్టుకున్నందుకు కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ, సీఐ స్వామి గన్నేరువరం ఎస్‌ఐ తాండ్ర నరేష్, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

చొప్పదండి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దీపావళి రోజున కాలిన టపాసులు మీద పడి గాయపడిన ఓ చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందింది. చొప్పదండికి చెందిన మహేష్, సరిత దంపతులు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. దీపావళి రోజున మహేశ్ దంపతులు నివాసం ఉంటున్న అపార్ట్మెంట్ కింద పిల్లలు టపాసులు కాల్చుకున్నారు. చల్ల మహేశ్వరి(8) కూడా టపాసులు కాల్చుతుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. తీవ్రంగా గాయపడ్డ మహేశ్వరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది.

అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీసుల కొరడా



సిరిసిల్ల పట్టణంలో దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు 24 బృందాలుగా ఏర్పడి దాడులు చేశారు. ఆరుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.80 లక్షల విలువైన 216 డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలో అనుమ తులు లేకుండా ఫైనాన్స్ నిర్వహించినా, అధిక వడ్డీలతో సామాన్యులను ఇబ్బందులకు గురిచేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర పరిస్థితి, తాత్కాలిక అవసరాల కోసం అధిక వడ్డీలకు అప్పు చేసి తర్వాత చెల్లించలేక ఆత్మహత్య చేసుకోవద్దన్నారు. ప్రభుత్వ అనుమతితో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలన్నారు. అక్రమ ఫైనాన్స్ నడిపేవారి వివరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

అన్నదాతలకు కోతుల బెడద



ధాన్యం తింటున్న కోతులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కోతుల బెడద తీవ్రమైంది. ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో శుక్రవారం రోడ్డుపై ఓ రైతు ఆరబోసిన ధాన్యం కుప్పలపై కోతులు చేరి తినేశాయి. ధాన్యం వద్ద కాపాల ఉన్న వా నరాలు తమ పైకి ఎదురు తిరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో కోతుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సొంతూరిపై మమకారం

● చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చేయూత ● నిధులు సమకూరుస్తున్న ప్రవాస భారతీయులు



విద్యార్థులతో ఎన్ఆర్ఐ ఇంద్రసేనారెడ్డి(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వంత ఊరుపై మమకారం.. అఆలు నేర్పి పాఠ శాలపై తరగని మక్కువ.. దశా బ్దకాలంగా పాఠశాలకోసం లక్షల రుపాయాల వెచ్చించి పాఠశాల అభివృద్దిలో భాగస్వామి అవు తూ పలువురికి ఆదర్శంగా నిల సుస్తున్నారు ఆ ఎన్ఆర్ఐ సోద రులు. తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన యలాల చిన్నఎల్లారెడ్డి-బాలవ్వ దంపతుల కుమారులు సుబాశ్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సత్యనారా యణరెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారు. గ్రామంలోనే ప్రభుత్వ పాఠశాల లో విద్యను అభ్యసిస్తున్న క్ర మంలో పెద్ద కుమారుడు సుభా ష్‌రెడ్డి మృతి చెందాడు. ముగ్గురు కుమారుల్లో ఇంద్ర సేనారెడ్డి, సత్యనారయణ రెడ్డి ఉన్నత చదువులు చదివి అమె రికాలో స్థిరపడ్డారు. చిన్న కుమా రుడు భాస్కర్‌రెడ్డి గ్రామంలోనే ఉంటున్నాడు.

● క్రీడా మైదానానికి సొంత స్థలం

తాము చదువుకున్న ప్రభు త్వ పాఠశాల అభివృద్ధికి అమెరి కాలో స్థిరపడ్డ యాలాల ఇంద్ర సేనరెడ్డి, సత్యనాయణరెడ్డి న డుం బిగించారు. మృతి చెందిన తమ సోదరుడు సుభాశ్‌రెడ్డి జ్ఞాపకార్థం పాఠశాల పక్కనే ఉన్న 19 గుంటల స్థలాన్ని క్రీడ మైదానం కోసం అందించారు. మై దానం చుట్టు ప్రహరీ, డయాస్‌ను నిర్మించారు. ఉపాధ్యాయుల కొరత ఏర్పడితే విద్యా వలంటీర్లను ఏర్పాటు చేసి వేతనాన్ని అంది స్తున్నారు. అటెండర్‌ను నియమించి వేత నం అందించారు. పాఠశాల కు రంగులు వేయించారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందిస్తున్నారు. సోద రులు ఇద్దరు అమెరికాలో ఉన్నత స్థానంలో ఉన్నా సొంతూరిని మరవకుండా తోడ్పాటునందిస్తున్నారు.

● పాఠశాలకు చేయూత నిస్తున్నారు..



యాలాల సోదరులు పాఠశాలకు చేయూత నివ్వడంలో ముందుంటారు. గతంలో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పుడు తాత్కాలికంగా విద్యా వాలీంటర్లను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందిస్తున్నారు. పాఠశాల కోసం లక్షల విలువ చేసే స్థలాన్ని విరాళంగా అందించారు.

- లత, ప్రధానోపాధ్యాయురాలు



వితరణగా అందించిన క్రీడా స్థలం, ఏర్పాటు చేసిన డయాస్

క్రైం కార్నర్

దుర్శేడ్‌లో గుడిసె దగ్ధం



పూర్తిగా దగ్ధం అయిన పూరి గుడిసె

కరీంనగర్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండ లం దుర్శేడ్ గ్రామంలో ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధం అయ్యింది. గ్రామంలో బుడగ జంగాల కాలనీలో తూర్పాటి కనకమ్మ గుడిసె వేసుకుని కొన్నేళ్లుగా నివాసం ఉంటుంది. శుక్రవారం ఉదయం దేవుళ్ల చిత్ర పటాల వద్ద దీపాలు వెలిగించి బయటకు వెళ్లింది. ప్రమాదవ శాత్తు పూరిగుడిసెకు నిప్పంటుకుని పూర్తిగ దగ్ధం అయ్యింది. ఈ సంఘటనలో కనుకమ్మకు చెందిన తులం బంగారంతో పాటు నగదు, అలాగే 20వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ఆమె తెలిపింది. అధికారులు స్పందించి కనుకమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడు (70)మృతి చెందినట్లు పోలీస్ అవుట్ పోస్ట్ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, రవి తెలిపారు. మృతుడి ఎడమ కాలుకు గాయాని సంబంధించిన బ్యాండెజ్ కట్టి ఉందని తెలిపారు. వృద్ధుడి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు టూటౌన్ పోలీసులకు సంప్రదించాలని కోరారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

సిరిసిల్ల క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుడుంబా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు చేసినట్లు చెప్పారు. 43 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని, 18 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 12 మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష

రుద్రంగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో 2017లో దసరా పండుగ సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తికి ఆరునెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ వేములవాడ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 2017లో రుద్రంగి హైస్కూల్ గ్రౌండ్‌లో దసరా ఉత్సవాల సందర్భంగా పోలీస్ కానిస్టేబుల్ ఎండీ ఇంతియాజ్ విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రుద్రంగికి చెందిన శ్రావణ్ అనే వ్యక్తి కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్గిస్తూ దాడి చేశాడు. కానిస్టేబుల్ ఫిర్యాదుతో అప్పటి ఎస్సై రమేష్ కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. శ్రావణ్‌కు శుక్రవారం వేములవాడ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి 6 నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ముత్తారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ముత్తారం మండలం ఓడెడు గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన చుంచు రమేష్ అనే యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ తన ద్విచక్రవాహనంపై కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గుంపుల మానేరు వంతెన దాటుతుండగా వావిలాల ఎక్స్‌రోడ్ వద్ద ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టడంతో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు.

కుక్కదాడిలో వృద్ధురాలికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం ఓ కుక్క దాడిలో వృద్ధురాలు శనిగరపు నర్సవ్వ తీవ్రంగా గాయపడింది. నర్సవ్వ శుక్రవారం ఇంటి ఎదుట కూర్చుంది. రోడ్డు పైనుంచి వచ్చిన కుక్క ఒక్కసారిగా ఆమెపై దాడి చేసింది. కుటుంబసభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సిరిసిల్ల ప్రభు త్వాసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దాంతో ఆమెను సిరిసిల్లకు తరలించారు.



గాయాలను చూపుతున్న వృద్ధురాలు

గోదావరిలో యువకుడి గల్లంతు



గల్లంతైన యువకుడికి కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

మల్లాపూర్, నవంబరు, 8 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వేంపల్లివెంకట్రావుపేట గ్రామ శివారులోని గోదావరిలో ఓ యువకుడు శుక్రవారం గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాయికల్ మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన పాకాల శ్రీవర్ధన్(18) అనే యువకుడు వేంపల్లివెంకట్రావుపేట గ్రామంలో ఓ శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని గోదావరికి వెళ్లి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టినా శ్రీవర్ధన్ ఆచూకీ తెలియలేదు.

జ్వరంతో బాలిక మృతి

రాయికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా రాయికల్ మండ లం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన ఉషకుల నిత్యశ్రీ(9)అనే బాలిక జ్వరంతో శుక్రవారం మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నిత్యశ్రీ రాయికల్ మండలం ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 9వతరగతి చదువుతోంది. దీపావళి సెలవులకు ఇంటికి వచ్చిన నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదండ్రులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు మూడు రోజుల క్రితం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందింది.



నిత్యశ్రీ(ఫైల్)

రైతలకు నాణ్యమైన సేవలు అందించాలి

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేశ్‌బాబు

గణేశ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని నార్తర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణా లిమిటెడ్ (టీజీఎన్ పీడీసీఎల్) కరీంనగర్ సర్కిల్ సూప రింటెండింగ్ ఇంజనీర్ మేక రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సులభతరంగా అర్థమయ్యే రీతిలో ఉండేందుకు ఎస్టిమేట్‌కు సంబంధించిన మెటీరియల్ తాలూకు వివరాలు, స్కెచ్ (నక్ష)ను తెలుగులో అందిస్తామని తెలిపారు. రైతులకు వ్యవసాయ ఎస్టిమేట్ కాపీలు తెలుగులో ఉండాలని తమ దృష్టికి తీసుకురావడంతో అందుకు అనుగుణంగా ఇంగ్లీష్‌లో కాకుండా ఇకనుంచి తెలుగులో అందచేస్తా మన్నారు. ఈ వివరాలు, రైతులకు వచ్చే ఎస్ఎంఎస్‌లో లింకు క్లిక్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చున్నారు. అలాగే ఎస్ఎంఎస్ కూడా తెలుగులోనే పంపిస్తామని తెలిపారు. రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందించే దిశగా ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యాచరణ చేపట్టిం దని అన్నారు. విద్యుత్ అధికారులు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి అక్కడ ఉన్న విద్యుత్ సమస్యలను పొలంబాట కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. వంగిన స్థంబాలు, లూజ్‌లైన్లను సరిదిద్దుతున్నామని తెలిపారు. మోటార్లకు కెపాసిటర్లు పెట్టుకోవాలని రైతులకు అవగాహనా కల్పిస్తున్నామని, కెపాసిటర్లు అమర్చడం ద్వారా మోటార్లు మరింత కాలం మన్నికగా ఉండేందుకు దోహదపడు తాయన్నారు. లోవోల్టేజ్ సమస్య ఉండదన్నారు. ఆటోసార్టర్లు కూడా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు మెరుగైన నాణ్యమైన సేవలు అందించడానికి సంస్థ కట్టుబడి ఉందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలైతినా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే జ్యోతి దేవి మృతి

అనారోగ్యంతో ఇటీవల ఆస్పత్రిలో చేరిక



మెట్‌పల్లి టౌన్/కోరుట్ల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతిదేవి అలియాస్ జ్యోతక్క శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. మూడు రోజుల క్రితం జ్యోతిదేవి అస్వస్థతకు గురవ్వడంతో కుమారులు చికిత్స నిమిత్తం బెంగుళూర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రిలోనే మృతి చెందారు. మెట్‌పల్లి నియోజకవర్గంలో కొమిరెడ్డి రాములు-జ్యోతి దేవి దంపతులు కాంగ్రెస్ పార్టీలో ఉండి రాజకీయంగా ఎదిగారు. జ్యోతిదేవి వెంకటరావుపేట ఎంపీటీసీగా గెలిచి మెట్‌పల్లి ఎంపీపీగా బాధ్యతలను నిర్వహించారు. అదే సమయంలో మెట్‌పల్లి ఎమ్మెల్యేగా ఉన్న చెన్నమనేని విద్యాసాగర్‌రావు కరీంనగర్ ఎంపీగా గెలుపొందడంతో మెట్‌పల్లి ఎమ్మెల్యే పదవికి విద్యాసాగర్‌రావు రాజీనామా చేశారు. దీంతో 1998లో మెట్‌పల్లి నియోజకవర్గంలో ఉప ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో జ్యోతి దేవి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డిపై సుమారు 4వేల ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం ఏఐసీసీ సభ్యురాలిగా కొనసాగారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ కోసం అప్పుడు ఢిల్లీలో ధర్నా నిర్వహించి మహిళలను చైతన్యవంతులను చేశారు. 14 నెలలు ఎమ్మెల్యే పదవిలో ఉండి మెట్‌పల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను నిర్వహించి నియోజకవర్గ ప్రజలకు దగ్గరయ్యారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గ, మహిళల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేశారు. న్యాయ విద్య అభ్యసించిన కొమిరెడ్డి జ్యోతి దేవి కొంతకాలం మెట్‌పల్లి కోర్టులో ప్రాక్టీస్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు కూడా న్యాయవాది. ఆమె కొడుకులు కొమిరెడ్డి కరం, కొమిరెడ్డి విజయ్ అజాద్, కొమిరెడ్డి కపిల్ ముగ్గురిని కూడా న్యాయ విద్య చదివించారు. జ్యోతి మరణించడంతో నియోజకవర్గంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు ఏడాది క్రితం మృతి చెందారు. జ్యోతి దేవి అంత్యక్రియలు ఆదివారం మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించనున్నట్లు సమాచారం.

నాట్యం.. నటన



నాట్యంలో వివిధ ప్రదర్శనలు ఇస్తున్న వేముగంటి ఆశ్రిత

ఐదేళ్ల వయస్సు నుంచే శాస్త్రీయ నృత్యాన్ని అభ్యసించి పట్టు పెంచుకుంది. జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలు ఇచ్చి పలువురి ప్రశంసలు అందుకుంది. అక్కడి నుంచి సినిమా రంగంవైపు అడుగులు వేసింది. ఆమె నటనకు మెచ్చిన దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి బాహుబలిలో కుంతల దేశపు రాణిగా అవకాశమిచ్చారు. ఈ పాత్ర ఆమె మంచి గుర్తింపు తెచ్చింది. చిత్రసీమలో తనదైన ముద్రను వేసింది హుజూరాబాద్ మండలం బోర్నపల్లికి చెందిన వేముగంటి ఆశ్రిత. నటన, నాట్యానికే పరిమితం కాకుండా సామాజిక రంగంపైనా దృష్టి సారించింది.



బాహుబలి-2 సినిమాలో అనుష్కతో వేముగంటి ఆశ్రిత

● సినిమా రంగంలో బోర్నపల్లి వాసి
● బాహుబలిలో పాత్రతో గుర్తింపు పొందిన ఆశ్రిత వేముగంటి
● కళా రంగం... సామాజిక రంగంలో తనదైన ముద్ర

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 8: సినిమా రంగంలో ప్రవేశించాలంటే ఒక సాహసం.. ఆ రంగంలో రాణించాలంటే కష్టంతో పాటు అదృష్టం కలిసి రావాలి.. ఈ వ్యాఖ్యాన్ని నిజం చేస్తూ.. ఎవరి సహాయం తీసుకోకుండా సినిమా రంగంలో అడుగులు పెట్టిన ఆ యువతి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకోగా.. తన ప్రతిభను సినిమా రంగానికే పరిమితం చేయకుండా తన చేతనంత సహాయం చేయాలన్న లక్ష్యంతో సామాజిక రంగంలో కూడా రాణిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంది. హుజూరాబాద్ మండలం బోర్నపల్లిలో జన్మించి కళా, సామాజిక రంగాల్లో రాణిస్తున్న వేముగంటి ఆశ్రితపై ప్రత్యేక కథనం.

● కుటుంబ నేపథ్యం...

హుజూరాబాద్ మండలం బోర్నపల్లికి చెందిన వేముగంటి రమేష్-డాక్టర్ గీతకు కుమారుడు అక్షయ్, కూతురు ఆశ్రితలు ఉన్నారు. రమేష్ వృతిరీత్యా కార్పొరేట్ ట్రైనర్‌గా విధులు నిర్వహిస్తుంగా డాక్టర్ గీత హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మెడికల్ సైన్స్ డీన్‌గా పనిచేస్తున్నారు. సౌత్‌జోన్ హెడ్ జీఈ ఎలక్ట్రికల్ ప్రొడక్ట్ మేనేజర్ రఘుతో వేముగంటి ఆశ్రిత వివాహం జరిగింది.



వైఎస్సార్ బయోపిక్ చిత్రంలో విజయమ్మ పాత్రలో..

● సామాజిక రంగం వైపు అడుగులు

ఓ వైపు సినిమా రంగంలో రాణిస్తూనే మరోవైపు తనవంతు బాధ్యతగా సహాయం చేసేందుకు రోసి కాన్వెంట్ పాఠశాలలో అల్యూమిని సభ్యురాలిగా చేరి సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మహిళా సాధికారత, బాలికల విద్య ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్నారు. హైద్రాబాద్ నగరంలో నిర్వహించే పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

● భరత నాట్యం, కూచిపూడితో జాతీయ స్థాయిలో గుర్తింపు

ఐదేళ్ల వయస్సులో నుంచి వేముగంటి ఆశ్రిత శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకోవడం ప్రారంభించింది. కూతురిలో ఉన్న ప్రతిభను గుర్తించిన తల్లి ప్రముఖ నాట్య శిక్షకురాలు ప్రియా కార్తీకేయన్, రాజేశ్వరి సాయినాథ్ వద్ద సాంప్రదాయ కళ, భరతనాట్యంలో ఆధునాతన శిక్షణ ఇప్పించారు. దీంతో కళా రంగంపై మక్కువ పెంచుకున్నారు. హైద్రాబాద్, చెన్నై, బెంగు ళూర్ వంటి ప్రధాన నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. మలేసియాలోని కౌలాలంపూర్‌లో మొదటి అంతర్జాతీయ ప్రదర్శన ఇచ్చారు. యూఎస్‌లో రెండు అంతర్జాతీయ ప్రదర్శనలు సైతం ఇచ్చారు. ప్రముఖనటుడు, దర్శకుడు కె విశ్వనాథ్ ఆమె ప్రదర్శనకు యాంకర్‌గా వ్యవహరించారు. ఈటీవీలో విశ్వనాథా మృతం, వనిత టీవీలో కలయశస్వీ షోలో ఆమె పాల్గొన్నారు.

● బాహుబలి-2, వైఎస్సార్ బయోపిక్‌లతో గుర్తింపు

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బాహుబలి-2 చిత్రంలో కుంతల దేశపు మహారాణి పాత్రకోసం దర్శకుడు రాజమౌళి వేముగంటి ఆశ్రితను ఎంపిక చేశారు. పాత్రకు సంపూర్ణ న్యాయం చేయడంతో ఆమె పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఆమె నటనను చూసిన వైఎస్సార్ బయోపిక్ చిత్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సతీమణి పాత్రలో చాలా బాగా నటించారని ఆచిత్రాన్ని తిలకించిన షర్మిలా, విజయమ్మ ప్రశంసించారు. క్రాక్ మూవిలో విలన్ పాత్రలో నటించి పలువురి ప్రశంసలు అందుకున్నారు.



దర్శక ధీరుడు విశ్వనాథ్‌తో వేముగంటి ఆశ్రిత

న్యూస్ బాక్స్

పుచ్చకాయపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రం



సీఎం ముఖ చిత్రాలతో కళాకారుడు అనిల్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రానికి చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్ పుచ్చకాయలపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రం తీర్చిదిద్ది అభిమానం చాటుకున్నాడు. శుక్రవారం 30 నిమిషాల వ్యవధిలో రెండు పుచ్చకాయలపై రేవంత్‌రెడ్డి చిత్రాన్ని వేశాడు. ఈ సందర్భంగా కళాకారుడు అనిల్‌ను కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించాలని, ప్రస్తుతం అందిస్తున్న సబ్సిడీని మరింత పెంచాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని భావనారుషినగర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఖిల్లాగా పేరొందిందని గతంలో సరైన ఉపాధి లేక మరమగ్గాల కార్మికులు ఆత్మహత్యలు చేసుకునేవారని అన్నారు. ఆత్మహత్యల నివారణ కోసం గత ప్రభుత్వాలు, ఇక్కడి కార్మికులు, నేతన్నలకు ఉపాధిని కల్పించి ఆదుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలలుగా నేతన్నలకు ఉపాధి కల్పించడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీగాధ మైసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుకు మహేష్, కౌన్సిలర్ పత్తిపాక పద్మ, బీజేపీ నాయకులు ఊరగొండ రాజు, గుడ్ల విష్ణు, చేనేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్, గుజ్జెతార, మాజీ సర్పంచ్ సంధ్యారాణి, సిరిసిల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జీవో 29ను ప్రభుత్వం సవరించాలి



మాట్లాడుతున్న రాగుల రాములు

సిరిసిల్ల టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుగా 29వ జీవోను సవరించిన తర్వాతే ఎస్సీ వర్గీకరణకు వెళ్లాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. జీవోతో బీసీలకు నష్టం వాటిల్లుతోందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పేద దళిత (మాలలు)ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేస్తామన్నారని గుర్తు చేశారు. దీన్ని వ్యతిరేఖిస్తూ ఈ నెల 23న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మాలల ఆధ్వర్యంలో ర్యాలీ, భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాజీ ఎంపీపీ బొల్లు మాల శంకర్, మాజీ కౌన్సిలర్ సిరిగిరి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

● చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో 2024-2025 సీజన్ ధాన్యం సేకరణపై అదనపు కలెక్టర్ లతతో కలిసి జిల్లా అధికారు లతో, మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు తూకం వేయాలన్నారు. కోతలు విధిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే అమ్మాలన్నారు. దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దన్నారు.

ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైస్‌మిల్లర్లు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దించుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. కొనుగోలు కేంద్రాలలో అధికారులకు రైతులు సహకరించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డీఎస్‌వో జితేందర్ రెడ్డి, డీఎం జితేంద్రప్రసాద్, కొడిమ్యాల, మల్యాల తహసీల్దార్లు రమేష్, మునీందర్, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ నర్సింహస్వామి, కొడిమ్యాల, మల్యాల మండలాల రైస్ మిల్లర్లు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తపడాలి



మోతె లో పొలంబాట నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు

ఏడీఈ జవహర్‌లాల్ నాయక్

జగిత్యాలరూరల్,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలబారి నపడకుండా జాగ్రత్త పడాలని ఏడీఈ జవహర్ లాల్‌నాయక్ రైతులకు సూచించారు. జగిత్యాల మంలడంలోని మోతె గ్రామంలో శుక్రవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పొలాల వద్దకు వెళ్లి విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్‌నాయక్ మాట్లాడుతూ రైతులు ట్రాన్స్‌పార్మర్ల ఫ్యూజులు ముట్టవద్దని, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉన్నందున ఎలాంటి సమస్యలు వచ్చిన విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కారిస్తారని తెలిపారు.

పొలాల చుట్టూ అక్రమంగా కంచెలు ఏర్పాటు చేయరాదని, పొలాల వద్ద రైతులు స్టార్టర్లు, ఫ్యూజ్‌లు నాణ్యతగా ఉండేవి ధంగా చూసుకోవాలని రైతులను కోరారు. ఈకార్యక్రమంలో ఏఈ శ్రీధర్, లైన్‌ఇన్ స్పెక్టర్ రాజయ్య, లైన్‌మెన్ రవి, అసిస్టెంట్ లైన్ మెన్ శివశంకర్, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్ రెడ్డి, రైతుసంఘంనాయకులు సదాశివరావు, రాజేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వృద్ధుల్లో మనోభావాలు నింపేందుకు అవగాహన సదస్సులు

సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యధర్శి హరి ఆశోక్ కుమార్

కోరుట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుల్లో మనోభావాలు నింపేందుకు ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యధర్శి హరి ఆశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో కోరుట్ల డివిజన్ సీనియర్ సిటీజన్స్ కార్యాయలంలో వృద్ధుల ఆత్మహత్య నివారణ - పిల్లల బాధ్యత అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించి పలు అంశా లను వివరించారు. వృద్ధుల ఆత్మహత్య నివారణకు వారి పిల్లలు బాధ్యత వహించాలన్నారు. స్వంత ఇండ్ల నుంచి వెళ్లగొట్టడం, వృద్ధుల సంరక్షన గృహా లు, ఆనాధ శరణాలయాలలో నెట్టి వేయడంతో తీవ్ర మానసిక వేదకు గురయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాటి నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆత్మహత్యలు నివారించడానికి ఒక మానసిక నిపుణుడిని నియమించాలని అన్నారు. ఈ సదస్సులో సిటిజన్స్ సభ్యులు పబ్బా శివానం, గంటేడి రాజ్‌మోహన్, లక్ష్మీనారాయణ, ఎండి సైపోద్దిన్, వెల్మల ప్రకాష్ రావు, సాభితలీ, చిలుక గంగారాం, రాజయ్యలతో పాట పలువురు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

వెల్గటూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, పీడీ మహేష్ తెలిపారు. ఈనెల 5న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జోనల్ లెవెల్ 14 సంవత్సరాల బాల బాలికల పోటీలలో సమీర, సాయి చరణ్, మల్లికార్జున్ లు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 8 నుంచి 10 వరకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. పాఠశాల నుంచి ముగ్గురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సామల కవిత, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన విద్యార్థి బబ్బిలి అక్షయ్ ఎంపికైనట్లు నిర్వహకుడు మరిపెల్లి ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడు నర్సాగౌడ్, కొమరయ్యలతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో అండర్-17 బాలుర వి భాగంలో బబ్బిలి అక్షయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గెలిపొందాడు. పోటీల్లో ప్రతిభ కనబరించిన విద్యార్థి అక్షయ్‌ను నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

వైకుంఠధామంలో కనీస వసతులు కరువు

● నీరు లేక ఇబ్బందులు.. వాగులో స్నానాలు
● ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు



వైకుంఠ దామంలో పని చేయని బోరు

కరీంనగర్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామ వైకుంఠధామంలో కనీస వసతులు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దహన సంస్కారాల తర్వాత స్నానం చేసేందుకు నీరు కూడా అందించలేని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామస్థులు పక్కనే ఉన్న వాగులో స్నానాలు చేస్తున్నారు. కరంట్ మోటార్ పనిచేయక రెండు నెలలు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదు. వైకుంఠ ధామంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయి. అధికారులు వైకుంఠ ధామంలో సౌకర్యాలు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న వైకుంఠధామం

న్యూస్ బాక్స్

గోశాలలో దీపారాధన వేడుకలు

సుల్తానాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీధర్మ శాస్త్ర గోశాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోమాత బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పదివేల దీపారాధన కార్యక్రమం నిర్వహించారు.బ్రహ్మోత్సవాల రెండో రోజు సందర్భంగా శుక్రవారం సాయంత్రం గోశాల ఆవరణలో పదివేల దీపాలను వెలిగించి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోశాల నిర్వాహకులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

జూలపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుంటే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ధూళికట్ట సింగిల్‌విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు అన్నారు. మండలంలోని బాల్‌రాజ్‌పల్లి గ్రామంలో శుక్రవారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గండు సంజీవ్, విండో వైస్ చైర్మన్ కంది మల్లారెడ్డి, మాజీ సర్పంచు కుంటూరి రాజయ్య, కోరికంటి మల్లయ్య, భూమయ్య, రాజయ్య సీఈవో రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాశ్వత భవనాన్ని నిర్మించాలి

కమాన్‌పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ భవన నిర్మాణం కోసం కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి నిధులను మంజూరు చేయాలని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ఓదెల మండలం తహసీల్దార్ భవన నిర్మాణం కోసం రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయని, అలాగే కమాన్‌పూర్ మండలానికి సైతం మంజూరు చేయాలని కోరారు.

నియామకం

పెద్దపల్లిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి మున్సిపల్ పట్టణ అధ్యక్షుడిగా పోసాని శ్రీనివాస్ యాదవ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు సందనవేణి రాజేందర్ యాదవ్ తెలిపారు. ఈమేరకు శ్రీనివాస్ యాదవ్‌కు శుక్రవారం పెద్దపల్లిలో నియామక పత్రం అందజేశారు. యాదవుల ఐక్యత, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శ్రీనివాస్‌కు సూచించారు. తన నియామకానికి సహకరించిన మేకల మల్లేశం యాదవ్, సందనవేణి రాజేందర్, యాదవ సంఘం నాయకులు, సభ్యులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో యాదవులను ఏకతాటిపైకి తెచ్చి యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

సిబ్బంది కొరతను తీర్చాలి

రామగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో బేగంపేట్ సెక్షన్ పరిధిలోని కల్వచర్లలో విద్యుత్ సిబ్బంది కొరతను నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో ఎలాంటి విద్యుత్ సమస్య ఉత్పన్నం అయినా సకాలంలో పరిష్కరించే పరిస్థితి లేదు. మేజర్ డిస్ట్రిబ్యూషన్‌గా ఉన్న కల్వచర్ల గ్రామానికి ఒకే ఒక్క లైన్‌మెన్‌తో నెట్టుకొస్తున్నారు. వ్యవసాయ బెల్టుగా ఉన్న గ్రామంలో 3500సర్వీసులు, 250 ట్రాన్స్‌ఫార్మర్స్, 15 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ విస్తీరించి ఉంది. నిబంధనల ప్రకారం ఒక లైన్‌మెన్‌కు జేఎల్ఎం, ఏఎల్ఎంను గానీ హెల్పర్‌నుగానీ ఏర్పాటుచేయాల్సి ఉంది. అయినా ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బంది కొరతను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జూలపల్లి వ్యవసాయ మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కరువు..

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు - పట్టించుకోని అధికారులు, పాలకవర్గం



శిథిలావస్థకు చేరిన జూలపల్లి మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం



జూలపల్లి వ్యవసాయ మార్కెట్‌లో వెలగని లైటు

జూలపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జూలపల్లి వ్యవసాయ మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చెల్లించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి జూలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీని ఏర్పాటు చేసింది. అయితే మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో రైతులకు సరిపడా కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు మండిపడుతున్నారు. కొన్నేళ్ల క్రితం ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో కొనసాగిన జూలపల్లి ఉపమార్కెట్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పూర్తిస్థాయి వ్యవసాయ మార్కెట్ కమిటీగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తొలి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన పాటకుల అనిల్, రెండోవసారి చైర్మన్‌గా మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన కంది చొక్కారెడ్డి పని చేశారు. కానీ వ్యవసాయ మార్కెట్‌లో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం గానీ, ఆదాయం పెంచడంలో గానీ ఇద్దరూ విఫలం కావడంతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని మండల రైతులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో పేరుకు మాత్రమే వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. రైతులు పండించే పత్తి, మొక్కజొన్న, కందులు, పసుపు, మిర్చి తదితర పంటలను మార్కెట్‌లో కొనుగోల్లు చేయకపోవడంతో సంబంధిత రైతులను దళారులు వెంటాడి అందినంత అడ్డగోలుగా దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నెల రోజుల క్రితం నూతన మార్కెట్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కనీసం నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గంలోనైనా సమస్యలు పరిష్కారానికి నోచుకునేలా చర్యలు చేపట్టాలని, మార్కెట్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల రైతులు కోరుతున్నారు.

గర్రెపల్లి సింగిల్ విండోలో అక్రమాలు

(5వ పేజీ తరువాయి)



గర్రెపల్లి సింగిల్ విండో కార్యాలయం

బదులు 7 లక్షలు రూపాయలు తీసుకున్నారని భూయజమాని సందేవేని శ్రీనివాస్ తెలిపారు. ఒప్పందం ప్రకారం తనకు రావాల్సిన 39 లక్షల రూపాయల్లో మరో 2 లక్షలు బెదిరించి తీసుకున్నట్లు భూయజమాని ఆరోపిస్తున్నాడు. ఇలా సొసైటీకి 5 లక్షలు రూపాయలు నష్టం కలిగించడంతో పాటు పాలకవర్గ సభ్యులు భూయజమానిని బెదిరించి మరో 2 లక్షల రూపాయలు కాజేశారు. అదనంగా తీసుకున్న డబ్బులు పాలకవర్గం చెందిన కొందరితో పాటు సహకార శాఖ అధికారులకు కూడా కొంత సొమ్ము ముట్ట చెప్పినట్లు సమాచారం. సంఘం పరపతి కాపాడాల్సిన వారే పరువు తీయడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

నాకు రూ.37 లక్షల ఇచ్చారు..

- సందేవేని శ్రీనివాస్, భూయజమాని

గర్రెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనానికి మూడున్నర గుంటల భూమిని విక్రయించాను. ఈ భూమికి రూ.39లక్షలు ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. బయట ఖర్చులు ఉంటాయని రూ.44లక్షలకు కొనుగోలు చేసినట్లుగా ఒప్పంద పత్రం రాయించుకున్నారు. నా పేరిట 44 లక్షల రూపాయల చెక్కులను అందజేసినప్పటికీ, అందులో నుంచి రూ.5 లక్షలకు బదులు, భూమి ధర ఎక్కువైందని అదనంగా రూ.2లక్షలు కలుపుకొని మొత్తం రూ.7లక్షలు డ్రా చేయించి తీసుకున్నారు. దీనిపై అధికారులు విచారణ జరిపించి నాకు రావలసిన రెండు లక్షల రూపాయలు ఇప్పించాలని కోరుతున్నాను.

నిధులను దుర్వినియోగం చేయలేదు..

- జూపల్లి సందీప్‌రావు, గర్రెపల్లి సహకార సంఘం చైర్మన్

సంఘం నూతన భవన నిర్మాణానికి సంబంధించిన భూమి కొనుగోలులో ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు. పాలకవర్గం అందరి నిర్ణయంతో 44 లక్షలకు భూమిని కొనుగోలు చేశాం. ఆ డబ్బులను చెక్కుల రూపేణా భూయజమానికి చెల్లించాం. ఎక్కడ కూడా నిధులు దుర్వినియోగం కాలేదు. 9 లక్షల రుపాయల నష్టాల్లో ఉన్న సంఘాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేసేందుకు కృషి చేస్తున్నాం. సంఘం నిధుల దుర్వినియోగంపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం. ఈ విషయంపై ఏ విచారణకైనా మేము సిద్ధమే.

ఘనంగా సీఎం, ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



పెద్దపల్లిలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ వంశీకృష్ణ..



గోదావరిఖనిలో..



సుల్తానాబాద్‌లో..



ధర్మారంలో..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు జన్మదిన వేడుకలను శుక్రవారం జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా రక్తదానం తదితర కార్యక్రమాలను చేపట్టారు. కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్



పెద్దపల్లి మండలం నిట్టూరులో..



ఎలిగేడులో..



కమాన్‌పూర్‌లో..



ఓదెలలో..

డిగ్రీ పరీక్షలను ఒకేసారి నిర్వహించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

కోల్‌సిటీటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ఆమోదిత డిగ్రీ కళాశాలలో జరిగే పరీక్షలను ఒకేసారి నిర్వహించాలని శాతవాహన యూనివర్సిటీ రిజిస్టర్ జి.వరప్రసాద్‌ను ఏఐఎస్ఎఫ్ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఎస్‌యూ రిజిస్ట్రార్‌కు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ కరోనా మహమ్మారి వల్ల డిగ్రీ పరీక్షలు గందరగోళంగా మారాయన్నారు. కరోనా రాకముందు ఏవిధంగా జరిగాయో అదేవిధంగా పరీక్షలను నిర్వహించాలన్నారు. ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు సెమిస్టర్ల పరీక్షలను ఒకేసారి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దోస్త్ వలన మొదటి సెమిస్టర్ పరీక్షలు ఆలస్యం అవుతున్నాయని ఆవిధంగా జరగకుండా చూడాలన్నారు. పరీక్షకు పరీక్షకుమధ్య ఒక్క రోజు సెలవు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాలపై రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్నకొండ సాయిఆజాద్, ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ కార్యనిర్వాహక కార్యదర్శి మామిడి హేమంత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లి రూరల్ , నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ క్రీడా పోటీల్లో పెద్దపల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన వారిలో పుట్ట వర్షిత, జంగలి శ్రీఅర్చన, సృజన్ చదువుతున్న విద్యార్థులు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 8 నుంచి 10 వరకు హుస్నాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ వేల్పుల సురేందర్ తదితరులు ఉన్నారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వావిలాలపల్లిలో గల శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో 27వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం ద్రవిడ వేదప్రబంధ పారాయణం, సాయంత్రం పరమపదోత్సవంతో అధ్యయనోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేచినేని అశోక్‌రావు, కార్పొరేటర్ మేచినేని వనజ, ప్రధానార్చకుడు సముద్రాల సత్యనారాయణాచార్యులు, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శనివారం ఉదయం 8 గంటల నుంచి విశ్వక్సేనారాధన, బ్రహ్మకలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సోమవారం జరిగే బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినికి సన్మానం



కావ్యశ్రీని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

సుల్తానాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు సుల్తానాబాద్‌కు చెందిన ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ధనుష్, శివరామ్‌లు ఎంపికయ్యారు. ఇటీవల పెద్దపల్లి జిల్లాలోని రామగిరి మండలం సెంటినరీ కాలనీలో జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో ధనుష్, శివరామ్‌లు తమ ప్రతిభను చాటుకున్నారు. దాంతో వీరిద్దరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. శుక్రవారం నుంచి నిర్మల్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల పది వరకు జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు వీరు వెళ్లినట్లు పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియలు తెలిపారు. అలాగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు కావశ్రీ అనే విద్యార్థిని ఎంపికయ్యింది. రాష్ట్ర స్థాయికి ఎంపికయిన కావ్యశ్రీని ప్రిన్సిపాల్ తదితరులు శుక్రవారం పాఠశాల ఆవరణలో అభినందించారు.



ఆర్జీ-3లో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

రామగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో శుక్రవారం ఐఎన్‌టీయూసీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవెంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జీఎం కార్యాలయంలో బ్రాంచ్ సెక్రెటరీ బెల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఎన్‌టీయూసీ నాయకుడు నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, నాయకులు జ్యోతి, కొంకా పోచయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఏరియాలో..

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్జీ-2 పరిధిలో ఘనంగా నిర్వహించారు. అన్ని డిపార్ట్‌మెంట్లతో పాటు యూనియన్ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు అక్రమ్, శంకర్‌నాయక్, దశరథంగౌడ్, రాజిరెడ్డి, రాజేష్, మార్కండేయ, ఆకుల రాజయ్య, వై తిరుపతి, మార్కరాజు, అనుము రాములు పాల్గొన్నారు. ఓసీపీ-1 సైటాఫీస్, బేస్‌వర్క్‌షాప్‌లో ఐఎన్‌టీయూసీ నాయకులు కేక్ కట్ చేశారు. గడ్డం తిరుపతి, జక్కుల దామోదర్‌రావు, శ్రీనివాసరావు, కొలిపాక సారయ్య, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ఆర్జీ-2 నిర్లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోతనకాలనీ కార్మికవాడలకు నీటి సరఫరా విషయంలో ఆర్జీ2 యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని టీబీజీకేఎస్ ఏరియా వైస్‌ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ ఆరోపించారు. వారంరోజులుగా కాలనీకి నీటి సరఫరా చేయకపోవడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజులకొద్ది నీటి సరఫరా లేకపోవడంతో కార్మికులు అవస్థలు పడుతున్నారన్నారు. కార్మిక కుటుంబాలు నీటి విషయంలో ఇబ్బందులు పడుతున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. టెక్నీషియన్ రిటైర్ అయ్యాడని, అతని స్థానంలో వేరే వ్యక్తిని నియమించకపోవడంతో నీటి సరఫరా సమస్య అలాగే ఉందన్నారు. తక్షణం టెక్నీషియన్‌ను నియమించి, మరమ్మతులు పూర్తిచేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తా..

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి సహాయసహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాండవుల గుట్ట ప్రాంతంలోని 597 సర్వే నంబర్‌లో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు భూమిపూజ చేశారు. అనంతరం అయ్యప్ప భక్తమండలి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానన్నారు. అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి వీరా రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి కొమురయ్య, కోశాధికారి కాసర్ల తిరుపతి, అల్లంల దేవేందర్, తొట్ల రవిప్రసాద్, రవి, శివారెడ్డి, స్వామి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



శాయంపేటలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ధర్మారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాయంపేట, గోపాల్‌రావుపేట గ్రామాల్లో శుక్రవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్ శెట్టి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. శాయంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్‌ను క్లబ్ సభ్యులు సత్కరించారు. అనంతరం గ్రామానికి చెందిన నిరుపేద మహిళ నరిగె ప్రమీలకు కుట్టు మిషన్‌ను అందజేశారు. గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన నిరుపేద రైతు తాండ్ర తిరుపతిగౌడ్‌కు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే చార్జింగ్ పంపుసెట్టును పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్‌సభ్యులు ఎండి ముజాహిద్, కట్ట రమేష్, ఉప్పలాంచ దయానంద్, చంద్రకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చింతల జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్‌లో కానరాని మధ్యాహ్న భోజన పథకం

- గత ప్రభుత్వ హయాంలో నెరవేరని హామీ - ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తగ్గుతున్న విద్యార్థులు

పెద్దపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరడం లేదు. దీంతో ప్రభుత్వ కళాశాలలో ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తున్నది. చాలామంది విద్యార్థులు గురుకుల విద్యాలయాల బాట పట్టడంతో పాటు ప్రైవేట్ కళాశాల వైపు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రంలో 423 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులతో పాటు వృత్తి విద్య కోర్సులను కూడా బోధిస్తున్నారు. ఈ కళాశాలల్లో చదివే విద్యార్థులంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మొదలైన మధ్యాహ్న భోజన పథకం క్రమంగా పదవ తరగతి వరకు కొనసాగిస్తూ వస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి ఇంటర్మీడియట్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. కానీ ఆ హామీ మాటలకే పరిమితం అయ్యింది. నాటి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయలేకపోయింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూడా బీఆర్ఎస్ పార్టీతో పాటు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఇంటర్మీడియట్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ ఇప్పటివరకు మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆలోచన చేయకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థి సంఘాలు సైతం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ పథకం అమలుచేయని కారణంగా ఏటా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గుముఖం పడుతున్నది. ఒక్కో కోర్సులో ప్రతి కళాశాలలో 80 నుంచి 100 అడ్మిషన్లు ఉండగా, సగంకూడా భర్తీకాలేదు.

జిల్లాలో 14 జూనియర్ కళాశాలలు..

జిల్లాలో 14 జూనియర్ కళాశాలలో ఉన్నాయి. ఇందులో గత ఏడాది మొదటి సంవత్సరంలో 5636 మంది, ద్వితీయ సంవత్సరంలో 5346 మంది విద్యార్థులు ఉండగా, ఈ విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరంలో 5346 మంది, ద్వితీయ సంవత్సరంలోమంది 5225 మంది విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది కంటే మొత్తం 1375 మంది విద్యార్థుల సంఖ్య తగ్గగా, మొదటి సంవత్సరంలో 290 మంది, ద్వితీయ సంవత్సరంలో 1085 మంది విద్యార్థులకు తగ్గింది. కథ ఏడాదికి ఇప్పటికి అడ్మిషన్లు పడిపోయాయి. ఇదే పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నట్లు కనబడుతున్నది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. మధ్యాహ్న భోజన పథకం లేని కారణంగా వివిధ గ్రామాల నుంచి పట్టణాలకు వచ్చే విద్యార్థులు పస్తులు ఉండాల్సి వస్తున్నది. విద్యార్థులు ఇంటి నుంచి లంచ్ బాక్సులు తీసుకుని వచ్చేందుకు మొహమాట పడుతున్నారు. ఆకలితో అలమటిస్తూ పూర్తి స్థాయి క్లాసులు వినలేక విద్యార్థులు మధ్యలోనే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మరికొంత మంది విద్యార్థులు అర్థంతరంగా విద్యను ఆపేస్తున్నారు. మరి కొందరు విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు.

దీంతో వాళ్లకు తీరని ఆర్థిక భారం అవుతున్నది. కేవలం మోడల్ స్కూళ్లలో చదివే ఇంటర్ విద్యా ర్థులు మాత్రమే ప్రతిరోజు ఇళ్ల నుంచి లంచ్ బాక్స్‌లను తీసుకువెళ్తున్నారు. అక్కడ కూడా 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, మోడల్ స్కూల్లో ఇంటర్ చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.